

హైదరాబాద్ వార్త

# తౌటోని కుంటను తెగనరికారు...!

**గొలుసుకట్టు చెరువుల గోస-5**

- నట్టనడిమికి తెగ్గొట్టి 40అడుగుల అక్రమదారి
- కబ్జాను కళ్లప్పగించి చూసిన అధికార ఘనులు
- మరింత విస్తరించి వంద అడుగుల రహదారి
- ఖాజాగూడలో మరుగునపడ్డ మరో కబ్జా భాగోతం
- ఔటర్ రింగురోడ్డు పక్కన 18ఏళ్ల సజీవ సాక్ష్యం



2010లో చెరువును ఎండబెట్టి రోడ్డు ప్రారంభించిన దృశ్యం(గూగుల్)



2017లో చెరువులో స్పష్టంగా కనిపిస్తున్న జలం(గూగుల్)



మరోమారు చెరువును ఎండబెట్టి 100ఫీట్ల రోడ్డు వేసుకుంటున్న దృశ్యం(ఫైల్‌ఫోటో)

సైబరాబాద్ ప్రతినిధి, సెప్టెంబరు 5 ప్రభాతవార్త

అది గచ్చిబౌలిలో ఆరంభమయ్యే ఔటర్ రింగురోడ్డుకు ఖాజాగూడకు మధ్యనున్న 150 అడుగుల రహదారికి ఆనుకొనివుండే మరో అమూల్యమైన జలవనరు.. దానికి ఆవలివైపు ఓబడా బిల్డరుకు ఎకరాల్లో స్థలమున్నా అక్కడికి వెళ్లేందుకు ఇంచుల్లో కూడా రోడ్డు లేకపోయేది.. కొనుక్కోవడానికి పక్కనే కావాల్సినంత ప్రైవేటు స్థలమున్నా అతని కన్నుమాత్రం కాపుకాసేవాడు లేక బేలగా చూస్తున్న కుంటపైనే పడింది.. తన స్థలంలో భవన నిర్మాణాల అనుమతులకోసం నాలుగెకరాల ఆ అమూల్యమైన నీటి వనరును నట్టనడిమికి తెగనరుకుతూ 40 అడుగుల దారిగా మార్చుకున్నాడు.. తన అధికార బలానికి అడ్డుచెప్పేవాడే లేకపోవడంతో గత ప్రభుత్వ హయాంలో ధర్జాగా వంద అడుగుల రహదారిగా విస్తరించి బహుళ అంతస్తుల భవనాలు చేపట్టిన మరో ఉదంతమిది.

**ఈకథ 18 ఏండ్ల క్రితం మొదలైంది..**

తొంభయవ దశకంలో మాదాపూర్‌లో హైటెక్‌సిటీ శంకుస్థాపనతో పరిసర ప్రాంతాల్లోని భూములకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. అప్పటి వరకు గజం వందల్లో ఉన్న భూముల ధరలు ఒక్కసారిగా వేలల్లోకి ఎగబాకాయి. రియలెస్టేట్ పెరుగుదలలో ఇదొక ప్రపంచ రికార్డుగా అప్పట్లో చెప్పుకునేవారు. ఇదే క్రమంలో గచ్చిబౌలి నానక్‌రామ్‌గూడ ప్రాంతంలో సైతం మరో సాఫ్ట్‌వేర్ లేఅవుట్‌కు అంకురార్పన జరగడంతో అటువైపు భూముల ధరలు సైతం చుక్కల్లో చేరాయి. అప్పట్లో రాయదుర్గం దాబా చౌరస్తానుంచి ఖాజాగూడ మీదుగా నానక్‌రాంగూడ విప్రోవరకు ఉన్న రోడ్డు చాలా చిన్నదిగా ఉండేది. గచ్చిబౌలి సాఫ్ట్‌వేర్ లేఅవుట్‌కు నగరం నుంచి రాకపోకలు పెరగడంతో ప్రభుత్వం ఈరోడ్డును విస్తరించింది. ఈరోడ్డును ఆనుకొని ఖాజాగూడ సర్వేనెంబరు 17లో 4.1ఎకరాల విస్తీర్ణంలో తౌటోనికుంట ఉండేది. ఇది మొత్తం ప్రభుత్వ శిఖం భూమి తప్ప గుంటకూడా ప్రైవేటు స్థలం కాదు.

**అసలు కథ ఇక్కడే ఆరంభమైంది..!**

తౌటోనికుంటకు ఆవలివైపు స్థానిక రైతులకు పట్టాభూములు ఉండేవి. అప్పటికే ఈభూములకు ధరలు పెరిగినా ఏమాత్రం రోడ్డు సదుపాయం లేకపోవడంతో సదరు రైతులు అయినకాడికి భూములను అమ్ముకోవాల్సివచ్చింది. ఎలాగైనా ఈ భూమికి రోడ్డు సదుపాయం కల్పించుకుంటానన్న నమ్మకంతో ఓ బడా బిల్డరు ఈభూములను దక్కించుకున్నాడు. వెనువెంటనే తన మాస్టర్ ప్లాన్‌ను అమలుచేసి కుంటలోకి చుక్క నీరు చేరకుండా చేశాడు. కుంట మధ్యనుంచి బండరాళ్లు మట్టిని పూడ్చడం ప్రారంభించగా ఈవిషయమై అప్పట్లోనే వార్త దినపత్రిక ప్రధాన సంచికలో కథనం ప్రచురించింది. స్థానికులు సైతం గొడవ చేసిన కారణంగా కొంతకాలం తన ప్రణాళికను పక్కనపెట్టాడు. ఆతర్వాత తనకున్న పలుకుబడితో ధర్జాగా తన భూమికి రోడ్డువేసుకొని భవన నిర్మాణాలకు అనుమతి తెచ్చుకోగా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు మాత్రం నోటీసులకే పరిమితమయ్యారు.

**40నుంచి100 అడుగులకు విస్తరణ**

ఇంత చేసినా తన భూమికి 40 అడుగుల రోడ్డు మాత్రమే అందుబాటులోకి రాగా అది బహుళ అంతస్తుల భవనాల అనుమతికి అడ్డంకిగా మారింది. దీంతో అప్పటికే ఉన్న రహదారికి ఇరువైపులా మట్టిని డంపింగ్ చేసి రోడ్డును మరింత విస్తరిస్తుండగా వార్త దినపత్రిక మరో కథనాన్ని వెలువరించింది. స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తినా అధికారుల్లో చలనం లేకపోవడంతో ధర్జాగా తనకు కావాల్సిన 100 అడుగుల రహదారి అందుబాటులోకి తెచ్చుకున్నాడు.

**చెరువులోకే డ్రైనేజి పైప్‌లైన్‌కు ప్లాన్**

చెరువులోంచే వంద అడుగుల రహదారిని చూపించి భారీ భవనాలకు అనుమతులు తెచ్చుకున్న సదరు నిర్మాణసంస్థ అదే రోడ్డు పక్కనుంచి అక్రమంగా డ్రైనేజి పైపులైన్ వేసుకొని దాన్ని మరోవైపు ఉన్న భగీరదమ్మ చెరువులో కలిపేందుకు యత్నించింది. ఇందుకు అడ్డంగావున్న ప్రధాన రహదారిని తవ్వేందుకు యత్నించగా ఈవిషయమై కూడా అప్పట్లో వార్త కథనం వెలువరించగా స్థానికులు గొడవచేయడంతో విరమించుకుంది. వ్యవస్థ లోని లోపాల కారణంగా ఇన్నాళ్లు ఈ నిర్మాణ సంస్థ అక్రమాలు కొనసాగగా ప్రస్తుతం బడాబాబుల అక్రమాలపై పాశుపదాస్త్రం ప్రయోగిస్తున్న హైడ్రా ఈ జలవనరును ఎలా కాపాడనుందో వేచిచూడాలి.

## ఖైరతాబాద్ మహాగణపతికి నేత్రాలంకరణ



హైదరాబాద్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త

ఖైరతాబాద్‌లో మట్టితో రూపుదిద్దుకున్న "శ్రీ సప్త ముఖ మహాశక్తి గణపతి" విగ్రహానికి గురువారం శిల్పి చిన్నాస్వామి రాజేంద్రన్ నేత్రోనిలనం కార్యక్రమం ద్వారా కంటిపాపను అమర్చి ప్రాణప్రతిష్ట చేశారు. విగ్రహ తయారీ పూర్త యిన తరువాత వినాయకుడికి కంటిపాపను అమర్చడం ద్వారా ప్రాణప్రతిష్ట చేసినట్లు అవుతుందని శిల్పి తెలిపారు. దివ్యజ్ఞాన సిద్దాంతి విఠలశర్మ సూచన మేరకు గురువారం మధ్యాహ్నం12 గంటల ప్రాంతంలో మహాగణపతికి కంటి పాపను అమర్చారు. శిల్పి రాజేంద్రన్ నేతృత్వంలో దాదాపు 200 మంది కార్మికులు, 70 అడుగుల విగ్రహాన్ని అన్ని వివరాలతో ఒకటిన్నర రోజుల్లో పూర్తిచేశారు.కాగా విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన కర్రలను పూర్తిగా తొలగిస్తామని ఉత్సవ కమిటీ కన్వీనర్ సందీప్ రాజ్ తెలిపారు.

## నగరంలో భారీ వర్షం







హైదరాబాద్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త

నగరంలో భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వరద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు ప్రాంతాల్లో రోడ్లపై గుంతల్లో వరద నీరు నిలవడంతో వాహనాలు నిదానంగా వెళ్లడం వల్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. మ్యాన్‌హోల్ పొంగి పొర్లి మురుగు నీటితో కలిసి దుర్వాసన రావడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు..ఖైరతాబాద్, నాంపల్లి, బేగంపేట, అమీర్‌పేట, జీడిమెట్ల, సూరారం, బాలానగర్, కూకట్‌పల్లి, కూకట్‌పల్లి, అల్విన్‌కాలనీ, హైదర్ నగర్, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి, బేగంపేట్, సికింద్రాబాద్, ప్యాట్నీ, పారడైజ్, చిలకలగూడ, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, సురారం, సనత్‌నగర్, ఎస్సార్ నగర్, పంజాగుట్ట, బంజారా హిల్స్, జూబ్లిహిల్స్, ఫిలింనగర్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, బోరబండ, నారాయణగూడ, కోఠి, బేగంబజార్, సుల్తా న్‌బజార్, నాంపల్లి, బషీర్‌బాగ్, పంజాగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట, దోమలగూడ, ట్యాంక్ బండ్, తార్నాక, బోడుప్పల్,నాచారం,హయత్ నగర్,ఎల్బీ నగర్, అమీర్‌పేట,అంబర్‌పేట, రామంతాపూర్, ఓయూ, నల్లకుంట,బర్కత్‌పుర,హిమాయత్ నగర్,అబిడ్స్, ముషీరాబాద్, దోమలగూడ, ఆర్టీసిక్రాస్‌రోడ్డు, చంద్రాయణగుట్ట, పాత బస్తీలోని తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. బోయిన్‌పల్లి, మారేడుపల్లి, అల్వాల్, బాలాజీ నగర్, ప్యాట్నీ ప్యారడైజ్, బేగంపేట్ ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. కుత్బుల్లాపూర్, చింతల్, గుండ్లపో చంపల్లి,మలక్‌పేట, వనస్థలిపురం, సరూ ర్‌నగర్, ఎల్బీనగర్, నాగోల్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది.

**గంటల కొద్ది రోడ్లపైనే వాహనాలు..**

వర్షానికి పలు ప్రాంతా ల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఖైరతాబాద్ మీదుగా కోఠి వెళ్లే రోడ్‌లో వాహనదారులు నరకం అను భవిస్తున్నారు. అమీర్‌పేట నుంచి మాదాపూర్ వెళ్లే మార్గంతో పాటు పంజాగుట్ట నుంచి కొండాపూర్ రోడ్డు, సికింద్రాబాద్ నుంచి జూబ్లీహిల్స్, మాదాపూర్ మీదుగా హైటెక్‌సిటీ వెళ్లే రోడ్డు మొత్తం వాహనాలతో బ్లాక్ అయింది. జేఎన్టీయూ నుంచి హైటెక్‌సిటీ మార్గంలో భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. ఒక్కో వెహికిల్ ఇంటికి చేరడానికి కనీసం గంట సమయం పట్టింది. ట్రాఫిక్ పోలీసులు ఉన్నా.. అనూహ్యంగా పెరిగిన వాహనాల రద్దీతో ఏం చేయలేకపోయారు.

నగరంలో ప్రధానరోడ్లు లింగంపల్లి నుంచి ఖైరతాబాద్, సికింద్రాబాద్ నుంచి హైటెక్ సిటీ వరకు,హబ్సిగూడ-నాచారం, ఉప్పల్-మేడిపల్లి.. వరంగల్ జాతీయ రహదారిలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

## ఫలక్‌నుమా ఆర్‌వోబి పనులు వేగవంతం చేయాలి

**-జిహెచ్‌ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట**




ప్రాజెక్ట్ సిఈ దేవానంద్‌తో కలిసి మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ అమ్రపాలి కాట

హైదరాబాద్, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:

ఫలక్‌నుమా ఆర్‌వోబి పనులు వేగవంతంగా పూర్తిచేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం చార్మినార్ జోన్‌లో పర్యటించి అక్కడ చేపట్టనున్న ప్రతిపాదిత అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె బండ్లగూడ ఫ్లైవర్ జంక్షన్ పనులను పరిశీలించారు. బండ్లగూడ నుంచి ఎర్రకుంట వరకు చేపట్టనున్న రోడ్డువిస్తరణ, తులసీనగర్ నుంచి గౌస్‌నగర్ వయా మైలార్‌దేవులపల్లి కాటేదాన్ ఫ్లైవోర్ నిర్మాణపనులు,ట్రిబ్యూనల్ నుంచి టిప్పు ఖాన్ మజీద్ వదరకు , ఇంజన్ బౌలి, బాబాబజార్ నుంచి భవాని నగర్ వరకు షేక్‌ఫైజ్ కమాన్ నుంచి డబీర్‌పురా ఫ్లైవోర్ వరకు ప్రతిపాదిత రోడ్డు విస్తరణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈసందర్భంగా సంబంధిత అధికారులకు పలుసూచనలు చేశారు. ఫలక్‌నుమాలో చేపట్టనున్న ఆర్‌వోబి పనులు వేగవతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో ప్రాజెక్ట్ సిఈ దేవానంద్, ఎస్‌ఈ దత్తుపంత్, చార్మినార్ జోన్ సిటీప్లానర్ మాజిద్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



గాంధీ ఆసుపత్రిలో అమరణ దీక్షను విరమింపజేస్తున్న బీసీ సంఘం నేత ఆర్.క్రిష్ణయ్య, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బి.ఎస్.పి.నేత పూర్ణ చందర్ రావ్ తదితరులు

కంటోన్మెంట్,సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని,సమగ్ర కుల గణను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో 12 రో జుల నుంచి నిరాహీర దీక్ష చేస్తున్న బత్తుల సిద్ధేశ్వర్‌ను దీక్షను విరమింప జేయాలని శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న, ఏపి బిఎస్‌పి కో-ఆర్డినేటర్ మాజీ డిజిపి డాక్టర్ పూర్ణచందర్ రావ్ బీసీ సంఘం నేత ఆర్. కృష్ణయ్య, మాజీ మంత్రి శ్రీని వాస్ గౌడ్‌లు సిద్ధేశ్వర్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సం దర్భంగా పూర్ణ చందర్ రావ్ మాట్లాడుతూ బిసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే వరకు పోరాట ఉద్యమాని తీవ్రం చేస్తామ న్నారు. కార్యక్రమంలో మాజీ స్వీకర్ మధుసూదన చారి, జస్టిస్‌లు ఈశ్వర్ రావ్,చంద్రకుమార్, బిసి సంఘం నేతలు చిరంజీవులు, మాజీ స్వీకర్ మధుసూదన చారి, పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

**-మేయర్ విజయలక్ష్మి**



ఉప్పల్ నల్ల చెరువును సందర్శించి నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి, డిప్యూటి మేయర్ శ్రీలత, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త :** నగరంలో వినాయక చవితి ఉత్సవాలకు ప్రభుత్వం పటిష్ట ఏర్పాట్లు చేసిందని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్, కాప్రా, చర్లపల్లి, నాగోల్, సరూర్‌నగర్ చెరువులను డిప్యూటి మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు ప్రభుదాస్, బన్నాల గీత, మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్, ఎస్ఇ అశోక్‌రెడ్డి, ఎసిపి చక్రపాణి, డిప్యూటి కమిషనర్లు అంజనేయులు, జగన్ తదితరులతో కలిసి ఆమె సందర్శించారు. చెరువుల వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన కొలనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వినాయక నిమజ్జనం కొలను వద్ద పోలీసులు, ఆరోగ్య సిబ్బంది, నిరంతరం విద్యుత్, రోడ్లు ఉండాలని సూచించారు. నిమజ్జనం కోసం వచ్చే గణనాథులకు భారీగా స్వాగతం పలుకాలని, వినాయక చవితి సందర్భంగా దెబ్బ తిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. ఉప్పల్ ప్రధాన రహదారి సమస్య తీవ్రంగా ఉందని, రెండు రోజుల్లోగా రోడ్డు మరమ్మతులు చేపడుతామని తెలిపారు. వినాయక చవితి సందర్భంగా రహదారులపై గుంతలు లేకుండా చూసుకోవాలని, భక్తులకు తాగునీరు, మరుగుదోడ్లు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువుల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ నల్ల చెరువు వద్ద వినాయక కొలను వద్ద భాగ్యనగర్ ఉత్సవ సమితి అసెంబ్లీ కన్వీనర్ రెవల్లి రాజు, కాంగ్రెస్ నేత మురళీధర్‌రెడ్డికి మధ్య గొడవ జరిగింది. దీనిపై పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్‌స్టేషన్ వద్ద భాగ్యనగర్ ఉత్సవ సమితి నేతలు ధర్నా నిర్వహించారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి, బన్నాల గీత ప్రవీణ్, భాగ్యనగర్ ఉత్సవ సమితి నేతలు,ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి నేతలు,వివిధ విభాగాల అధికారులు,పోలీసులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాలతో ఎన్నో ఉపయోగాలు

**-సౌత్ జోన్ అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్**



సమావేశంలో పాల్గొన్న దక్షిణ మండలం అడిషపల్ డిసిపి షేక్ జహంగీర్,చార్మినార్ ఏసిపి పి.చంద్రశేఖర్,చార్మినార్ సిఐ కె.చంద్రశేఖర్

**చార్మినార్,సెప్టెంబరు 5 ప్రభాతవార్త :** సిసి టివి కెమెరాలు వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని దక్షిణ మండలం అడిషపల్ డిసిపి షేక్ జహంగీర్ అన్నారు.చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరంలో గురువారం రాత్రి పాతబస్తీ బంగారం వ్యాపారులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన బంగారం వ్యాపారులను ఉద్దేశించి మాట్లాడుతూ బంగారం వ్యాపారులు తమ షాపులతో పాటు బయట ప్రాంతాలలో కూడ సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.సిసి టివి కెమెరాలు వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు.సమావేశంలో చార్మినార్ ఏసిపి పి.చంద్రశేఖర్,చార్మినార్ సిఐ కె.చంద్రశేఖర్,చార్మినార్ డిఐ బ్రహ్మ మురారీ,చార్‌కమాన్ షరాఫా అసోసియేషన్ ప్రతినిధులు,వ్యాపారులు విజయ్ అగర్వాల్,అరుణ్ సంఘీ,తరుణ్ అగర్వాల్ పాల్గొన్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్



క్రీడాకారులతో సిఐ సతీష్

**దుండిగల్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:**
ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా సైబరాబాద్ కమీషనర్ ఆదేశాల మేరకు దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల యువకులకు దుండిగల్ పోలీసుల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. గండిమైసమ్మలోని జ్యోతిరావుపూలే స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగే క్రీడాపోటీల్లో 12 జట్లు పాల్గొంటున్నాయి. ఈమేరకు గురువారం సిఐ సతీష్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో మమేకమై వారి శాంతిభద్రతల పరిరక్షణయే ధ్యేయంగా పనిచేస్తున్నారు. ఫ్రెండ్లీ పోలిసంగ్‌లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై శంకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

### గణేష్ ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలి

**చార్మినార్,సెప్టెంబరు 5 ప్రభాతవార్త :** గణేష్ ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని మొగల్‌పుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పిడిఎన్ ప్రసాద్ అన్నారు. పాతబస్తీలో ఓల్డ్ సిటీకా రాజా ఆగమన్ కార్యక్రమం వైభవంగా జరిగింది. సుల్తాన్ షాహి శ్రీ జగదాంబ మందిరం చైర్మన్ రాకేష్ తివారీ ఆధ్వర్యంలో లాల్‌దర్వాజ చౌరస్తా తివారి టవర్స్ వద్ద ప్రతిష్టించనున్న భారీ వినాయకుడికి ఘన స్వాగతం పలికారు. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, రాకేష్ తివారిలు లంభోదరుడికిప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు భక్తి ప్రపత్తులతో గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు. శ్రీ జగదాంబ మందిరం కమిటి చైర్మన్ రాకేష్ తివారీ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. కాగా ఇన్‌స్పెక్టర్‌ప్రసాద్‌ను రాకేష్ తివారి, శశాంక్ తివారిలు కలిసి శాలువ కప్పి సన్మానించారు. భారీ గణనాథుడిని పెద్ద ఎత్తున ప్రజలు తిలకించారు.

### సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర చాలా గొప్పది



ఉపాధ్యాయులు మహ్మద్ అబ్దుల్ మాజిద్‌ను సన్మానిస్తున్న డైరెక్టర్ ఖలీల్ ఉర్ రెహ్మాన్

**చార్మినార్,సెప్టెంబరు 5 ప్రభాతవార్త**
సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర చాలా గొప్పదని న్యూమోడల్ హైస్కూల్ డైరెక్టర్ ఖలీల్ ఉర్ రెహ్మాన్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పాతబస్తీ హుస్సేనీఆలంలోని న్యూమోడల్ హైస్కూల్‌లో గురువారం ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. న్యూమోడల్ హైస్కూల్‌లో గత ముప్పై సంవత్సరాలు నుంచి తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయులు మహ్మద్ అబ్దుల్ మాజిద్‌ను పాఠశాల డైరెక్టర్లు ఖలీల్ ఉర్ రెహ్మాన్, జియా ఉల్ రెహ్మాన్‌లు కలిసి శాలువ కప్పి సన్మానించి మెమోంటోను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఖలీల్ ఉర్ రెహ్మాన్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర ఉన్నతమైదని తెలిపారు. తెలుగు ఉపాధ్యాయులు మహ్మద్ అబ్దుల్ మాజిద్ మాట్లాడుతూ దేశ ప్రగతికి సారధులు ఉపాధ్యాయులేనని తెలియజేశారు. మన దేశంలో గురువుకు గొప్ప స్థానం ఉందని ఆయన తెలిపారు.. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షించాలి : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష, చిత్రంలో కార్పొరేటర్ బి.పద్మా తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త**
పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరు మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి పూజించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పిలుపునిచ్చారు. గురువారం బాగ్ అంబర్‌పేట్, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ కమ్యూనిటిహాల్‌లో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతులు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి, ఏఎంహెచ్ఓ హేమలతలతోకలిసి మట్టి గణపతుల ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయణ రం గులతో తయారు చేసిన విగ్రహలతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని, ప్రతి ఒక్కరు మట్టి గణపతులను ఆరాధించాలన్నారు.

### ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసిన ఎంప్లాయిస్ కాలనీ సభ్యులు




ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసిన మణికొండ ఎంప్లాయిస్ కాలనీ నూతన కమిటీ సభ్యుల దృశ్యం

**నార్సింగి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఎంప్లాయిస్ కాలనీ నూతన కార్యవర్గంను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎంఎస్ఎన్ చార్యులు, ఉపాధ్యక్షులుగా రమేష్, కార్య నిర్వాహక కార్యదర్శిగా సంతోష్ యాదవ్, కోశాధికారిగా ప్రేమ్ కుమార్, అశోక్, వేణుగోపాల్‌లు ఎంపికయ్యారు. ఈ నతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి సన్మానించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ కాలనీ సంఘాల ప్రతినిధులు ప్రజల సమస్యలను వెంటనే స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలని, వీలైనంత త్వరగా ఆ సమస్యలు పరిష్కరించబడేలా నాయకులు, అధికారుల చుట్టూ తిరుగాలన్నారు. మేజర్ సమస్యలుంటే నేరుగా నా దృష్టికి తీసుకురావాలని, సంబంధిత శాఖల అధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. కాలనీ సంఘాల ప్రతినిధులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇలా అందరం ప్రజల ఇబ్బందులను దూరం చేసేందుకు పని చేయాలని ప్రకాశ్‌గౌడ్ సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఫ్లోర్ లీడర్ రామ కృష్ణారెడ్డి, శైలజా తదితరులు పాల్గొన్నారు.

## రాజధాని హైదరాబాద్‌కు ధీటుగా నార్సింగి అభివృద్ధి చేస్తాం

### - రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**నార్సింగి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహా నగరానికి ధీటుగా నార్సింగి మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 1,2,3,12,13,14.వార్డులలో రూ. 11.60కోట్ల అభివృద్ధి పనులను రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సంఘం చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే నరేందర్ ముదిరాజ్, పిసిసి అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, సీనియర్ నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్ యాదవ్, ఆర్.నర్సిహ్మా, మున్సిపల్ ఛైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ విజయ్‌బాబులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ మౌళిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిదులు ఖర్చు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా మంచినీరు, భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు, సీసీ రోడ్లు, స్మశాన వాటికలు, పార్కులు, జిమ్‌లు, అదనపు తరగతి గదులు, కమ్యూనిటీహాళ్లు వంటి వాటికి ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని, కుల,మత,పార్టీలకు అతీతంగా ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనులు చేయిస్తున్నామని వివరించారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారుల ద్వారా నిధులు మంజూరు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు యాదమ్మ, రేఖ యాదగిరి, దుర్గేష్ యాదవ్, శివారెడ్డి, విజేత ప్రశాంత్ యాదవ్, ప్రవల్లిక కిరణ్, సునీతా గణేష్, ఆదిత్యరెడ్డి, నరేష్, కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణ కోసం మట్టిగణపతులను ప్రతిష్టించాలి : డిప్యూటీ మేయర్



మట్టివినాయకులను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి

**తార్నాక, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ కోసం మట్టిగణపతులను ప్రతిష్టించాలని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో గురువారం టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డితో కలిసి ఆమె ప్రజలకు మట్టిగణపతులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ భక్తి శ్రద్దలతో మట్టిగణపతులను ఏర్పాటు చేసుకోవాలని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ గణపతులను ఏర్పాటు చేయడంతో పర్యావరణానికి హాని కల్గించినవాళ్లం అవుతామన్నారు. దీనిని ప్రజలు గుర్తించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

### ఉద్యమంలో ప్రొఫెసర్ కోదండరామ్ పాత్ర చరిత్రలో ఉంటుంది



ప్రొఫెసర్ కోదండరామ్‌ను సత్కరిస్తున్న అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త

**చిక్కడపల్లి, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:**
ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జేఏసీ చైర్మన్‌గా రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ కోదండరామ్ చేసిన సేవలు చరిత్రలో నిలిచి ఉంటాయని అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. రాష్ట్ర శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరామ్‌ను గురువారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవిఎఫ్) నాయకులతో కలిసి ఉప్పల శ్రీనివాస్ గుప్త ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షను నెరవేర్చడంలో కీలకపాత్ర పోషించినందుకుగాను కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీగా గుర్తింపు ఇవ్వడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల రజనీకాంత్‌గుప్త, జనగాం జిల్లా అధ్యక్షుడు బిజ్జల నవీన్, రాష్ట్ర యువజన సంఘం నాయకులు నరేష్‌గుప్త, భరత్‌గుప్త, సాయిగుప్త, శ్రీధర్, వీరేందర్‌గుప్త, తెలంగాన జనసమితి నాయకురాలు పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

### కోర్టు వివాదంలో ఉన్న పనులను ఎలా చేస్తారు : స్థానికులు



పనులను నిలిపివేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న మారుతినగర్, సాయినగర్ వాసులు

**తార్నాక, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** మారెడ్‌పల్లి మండలం పరిధిలోని తార్నాక సాయినగర్, మారుతినగర్ కాలనీకి సంభందించి తమ సమస్య కోర్టువివాదంలో ఉన్నా ఇరిగేషన్ అధికారులు అభివృద్ధి పనులను ఏవిధంగా చేస్తారని పలువురు స్థానికులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న మారెడ్ పల్లి మండల తహసిల్దార్ భీమయ్య గౌడ్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. సంభందిత కాంట్రాక్టర్‌కు ఆయన ఫోన్ చేసి ఈ స్థలం కోర్టు వివాదంలో ఉన్నప్పటికి పనులు ఏవిదంగా చేస్తారని ప్రశ్నించారు. మీవద్ద ఉన్న టెండర్‌కు సంబంధించిన పత్రాలను తీసుకొని రావాలని సూచించారు. అప్పటి వరకు తూము కల్వర్టు పనులను నిలిపివేయాలని పేర్కోన్నారు. తాము కూడా ఈ సమస్యను ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పారు. కాగా స్థానికులు మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ ఐదున్నర ఎకరాల స్థలాన్ని ఎఫ్‌టిఎల్‌గా నిర్ధారించిందని ఎఫ్‌టిఎల్‌ను అభివృద్ధి చేకుండా స్థానిక విజయడెయిరీ, రైల్వే వర్క్ షాపు నుంచి వచ్చే నీటిని నిలువ ఉంచేందుకు తూమూ ఎత్తు పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. దాదాపు 121 మంది ప్లాట్లు, ఇంటి యజమానులం 30 నుంచి 40 సంవత్సరాలుగా భూసమస్యను ఎదుర్కోంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయపరంగా తాము సమస్యను పరిష్కరించుకుంటామని చెప్పారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

**నిజాంపేట్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**
నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్న 2 గంటల వరకు నిజాంపేట్ ఫీడర్, ఎస్ఎల్‌జి ఫీడర్, మా విల్లాస్ ఫీడర్ పరిధిలోని శ్రీనివాస్ లేక్‌వ్యూ, పోలీస్‌స్టేషన్, బాచుపల్లి విలేజ్, రైసీనియా బిల్డర్స్ మమతా హాస్పిటల్ ఎదురుగా, శికర విల్లాస్ నుంచి బాచుపల్లి సిగ్నల్ మెయిన్ రోడ్, నిజాంపేట్ రోడ్, మా విల్లాస్‌లలో కరెంట్ ఉండదని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

### అర్హతలేని బడి దొంగకు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు ఎలా ప్రకటిస్తారు?



సమావేశంలో మాట్లాడుతున్న బూర శ్రీనివాస్

**సైఫాబాద్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:**
ఉపాధ్యాయ విధుల్లోకి రాకుండా ఉన్న ఒక బడి దొంగ ఉపాధ్యాయుడికి రాష్ట్ర ప్రభుత్వం ఏలా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును ప్రకటించిందని ఆసిఫ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక స్కూల్ సెకండరీగ్రేడ్ టీచర్ బురా శ్రీనివాస్ ప్రశ్నించారు. అన్ని అర్హతలు కలిగిన టీచర్లకు ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రదానం చేస్తే ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషిస్తారని ఆయన చెప్పారు. గురువారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ డిఇఓ సహకారంతో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక కమిటీ, మారేడుపల్లి, అడ్డగుట్టలోగల ప్రభుత్వ హైస్కూల్‌లో పనిచేస్తున్న వి.డి.సత్యనారాయణకు ఈ ఏడాది హైదరాబాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేశారని తెలిపారు. సత్యనారాయణ ఏనాడు స్కూల్‌కు రాలేదని, అతనిపైన అనేక ఆరోపణలు ఉన్నాయని చిట్టీల వ్యాపారం చేస్తూ ఓల్డ్ ఏజ్ హోంను కూడా కొనసాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. సత్యనారాయణను ఎంపిక చేసిన కమిటీపై ప్రభుత్వం విచారణ జరిపి, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై రాష్ట్ర గవర్నర్‌కు తాము ఫిర్యాదు చేస్తామని బూర శ్రీనివాస్ చెప్పారు. ఈసమావేశంలోరఘు సమ్మయ్యగౌడ్ కూడా పాల్గొన్నారు.

### పర్యావరణహిత మట్టివిగ్రహాన్ని పూజిద్దాం

**-జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ**



సిబ్బందికి మట్టివిగ్రహాలు అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మీ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:**
గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మట్టివినాయక ప్రతిమలను పూజిద్దామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ పిలుపునిచ్చారు. గురువారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జిహెచ్ఎంసి ఉద్యోగులు, సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాలను మేయర్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణం కల్పించడం ,పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పర్యావరణం పట్ల ప్రజలను చైతన్య పర్చడంలో భాగంగా జిహెచ్ఎంసి ద్వారా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. అందులోభాగంగా ఈసంవత్సరం జిహెచ్ఎంసి ద్వారా 3.10లక్షల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందులో 8ఇంచులు 2.70 లక్షలు, ఒకఫీట్ సైజులో 30వేలు, ఒకటిన్నర ఫీట్‌సైజులో 10వేల విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పంజక, ఛీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ , జిహెచ్ఎంసి అధికారులు పాల్గొని మట్టి వినాయక ప్రతిమలను స్వీకరించారు.

### నగలు దుకాణాల్లో ఆభరణాలు చోరీకి పాల్పడుతున్న ముఠా అరెస్టు..

**కొంపల్లి సెప్టెంబర్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**
బుధవారం 4వ తేదీ మధ్యాహ్నం సుమారు 12 గంటలకు బంగారు దుకాణాల్లోకి కస్టమర్లుగా వెళ్లి ఆభరణాలు చోరీ చేస్తున్న నలుగురు నిందితులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో ముగ్గురు స్త్రీలు బొజ్జగాని దీనమ్మ, బొజ్జగాని నాగేంద్రమ్మ, వెంకట్‌రావమ్మ, ఒక పురుషుడు బాలసాని అశోక్‌గా గుర్తించారు. మరో ఇద్దరు నేరస్తులు తప్పించుకున్నట్లు పోలీసులు తెలిపారు. తప్పించుకున్న వారిలో ఒకరు బొజ్జగాని జ్ఞానమ్మ, మరొకరు బాలసాని వెంకటపతిగా తెలిపారు. నేరం జరిగిన ప్రదేశంలో సీసీటీవీ ఫుటేజీలను తీసుకుని, దారిలో ఉనన్న సీసీటీవీ కెమెరాలను ధృవీకరించడం ద్వారా మొత్తం (05) కేసులు గుర్తించారు. వీటిలో (03) జగద్గిరిగుట్ట జిల్లా పరిషత్ స్టేషన్ (01) చట్నాయపురి కేసు రాచకొండ కమీషనరేట్ పోలీస్ స్టేషన్, (01) నేరంకోసం ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కారును సీజ్ చేశారు. నలుగురు మహిళలు ఇద్దరు పురుషులతో నిందితులు ఓ బృందంగా ఏర్పాటూ వీరంతా నాలుగు చక్రాల వాహనంలో వచ్చి అక్కడి నుంచి ఇద్దరు, ఇద్దరు మహిళలుగా విడిపోయి ఒక చోటికి చేరుకుని నగల షాపులకు కస్టమర్‌గా నడుచుకుంటూ వెళ్లి అక్కడ ఉన్న బంగారు వస్తువులను చూసి సేల్స్ మేన్ దృష్టిని మరల్చి అసలు వస్తువులను రోల్డ్‌గోల్డ్, వస్తువులతో భర్తీ చేసి పారిపోయారు. పైన తెలిపిన నేరస్తుల్లో ఇదివరకే వివిధ పోలీస్ స్టేషన్‌లో కొన్ని కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలో బాలానగర్ జోన్ జగద్గిరిగుట్ట పోలీస్ సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా టీములుగా ఏర్పడి అటెన్షన్ డైవర్షన్ అపెండర్స్‌ను అరికట్టేందుకు సవాల్గా తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి పొన్నం



సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్,మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త**
అంబర్‌పేట గౌడ్ సంఘం భవనంలో సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని గురువారం విగ్రహావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకట్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఖైరతాబాద్ డిసిపి అధ్యక్షులు రోహిన్‌రెడ్డి, హాండ్లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణగౌడ్, కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, బి.పద్మ, కాంగ్రెస్ నేతలు జ్ఞానే:శ్వర్‌గౌడ్, శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. మహాత్ముల విగ్రహాలు మనకు స్ఫూర్తి అని, ఆనాడు బలహీన వర్గాలను కలుపుకొని రాజ్యాధికారానిన సాధించారన్నారు. మనమందరం కూడా కలుపుకొని ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.

**గౌడ భవనం ఏసీ ఏర్పాటుకు 10లక్షలు విరాళం అందజేసిన రోహిన్‌రెడ్డి..**

అంబర్‌పేట గౌడ్ భవనంలో ఏర్పాటు చేసుకోవడానికి రోహిన్‌రెడ్డి 10 లక్షలు విరాళం అందించారు. సంఘాల అభివృద్ధి కొరకు అందరూ ఐక్యంగా కలిసి ముందుకు పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మా వెంకట్‌రెడ్డి, దూసరి లావణ్య, శ్రీనివాస గౌడ్, విజయ్ కుమార్‌గౌడ్, టిపిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, అంబర్‌పేట్ గౌడ సంఘం నేతలు, సంఘం చైర్మన్ మాజీ కార్పొరేటర్ జ్ఞానేశ్వర్‌గౌడ్, అధ్యక్షులు బింది రాజుగౌడ్, ఉపాధ్యక్షులు రమేష్‌గౌడ్, రంగనాథ్ గౌడ్, పృథ్వీ గౌడ్, నగేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువు, కుంటలను అక్రమించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి



సమావేశంలో కబ్జాకు గురైన చెరువు మ్యాప్‌ను ప్రదర్శిస్తున్న రైతులు

**సైఫాబాద్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:** భూముల ధరలకు రెక్కలు రావడంతో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు అక్రమణకు గురవుతున్నాయని, అక్రమణదారులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం వెలిమెల గ్రామం రైతులు డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ గ్రామ రైతులు ఖానపురం శేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ వెలిమెల గ్రామంలో మాజీ సర్పంచ్ మహిపాల్ గౌడ్ సర్వే నెంబరు 421, 15లో గల చెరువుకు సంబంధించిన సుమారు 50 ఎకరాల భూమిని, చెరువు తూమును కబ్జా చేసి, ఇతరులకు రహదారి లేకుండా చేశారని ఆరోపించారు. ఈ విషయంపై ఈ మేరకు జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్, ఎంఆర్ఓ తదితర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని చెరువును స్వాదీనం చేసుకుని పునరుద్ధరించాలని, తూమును పునర్మించాలని కోరారు. చెరువును కబ్జా చేసి అక్రమ కట్టడాలను నిర్మించిన మహిపాల్‌గౌడ్‌పై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. మహిపాల్‌గౌడ్ తాను కాంగ్రెస్ పార్టీ నాయకుడని ప్రజలను, రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు

## కార్మికుల లబ్దికి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు కృషి



వివరాలు సేకరిస్తున్న తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అధికారులు

**చిక్కడపల్లి, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన నిర్మాణరంగ కార్మికులకు, వలస కార్మికులకు లబ్ది కలిగించేందుకు తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు (టిబిఓసిడబ్ల్యుడబ్ల్యుబి) వారి హక్కులను, సంక్షేమాన్ని రక్షించడంలో ముందుకు సాగుతోందని బోర్డు సీఈవో, కార్యదర్శి డాక్టర్ ఇ.గంగాధర్ అన్నారు. గురువారం నెల రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా భవన, ఇతర నిర్మాణ కార్మికుల రిజిస్ట్రేషన్ కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గురువారం నగరంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి కార్మికులకు అవగాహన కలిగించేందుకు డ్రైవ్ నిర్వహించింది. గత నెల 19న ప్రారంభించిన ఈ కార్యక్రమం ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగనుంది. నిర్మాణరంగానికి చెందిన కార్మికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, తమ రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకుని లాభపడాలని కోరారు. ఈ డ్రైవ్‌లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి కార్మికులకు విధిగా రెన్యువల్ చేసుకునేలా అవగాహనను కూడా ఈ డ్రైవ్‌లో చేపట్టారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో సహాయ కార్మిక శాఖ అధికారులు ఇతర నిర్మాణ ప్రదేశాల్లో అవగామన సదస్సులు నిర్వహించారు. కార్మికులందరు ఈ-శ్రమ్ పోర్టల్‌లో కూడా రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ఈ పోర్టల్‌లో, బిఓసీ పోర్టల్‌లో రిజిస్టర్ చేయడానికి కార్మికులకు తమ సమీపంలోని మీ-సేవలో ఆధార్ కార్డును, బ్యాంక్‌పాసు బుక్ మొదటి పేజీ, పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో పాటు, నామినీ, కుటుంబ సభ్యుల వివరాలు అందించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమాలతో పాటు, టిబిఓసిడబ్ల్యుడబ్ల్యుబి మొదటి సెస్ చెల్లించని నిర్మాణ యజమానులకు అధికారులు నోటీసులు కూడా జారీ చేస్తారు. ఈ నిధులు నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం అవసరమైన పథకాలను కొనసాగించడానికి ఉపయోగపడుతాయి.

## కొత్తపేట ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన 'హైడ్రా' అధికారులు



హైడ్రా అధికారులకు వివరాలు వెల్లడిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** కొత్తపేటలోని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కార్పొరేటర్, కాలనీవాసులు చేసిన ఫిర్యాదు మేరకు గురువారం హైడ్రా అధికారులు స్థలాన్ని పరిశీలించారు. కొత్తపేట డివిజన్ తెలంగాణ పార్క్ శ్రీరామలింగేశ్వరకాలనీలో ఉన్న సర్వేనంబర్ 143,146,159,160లలో సుమారు 3.12ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా అధికారుల బృందం హైడ్రా తహసిల్దార్ హేమామాలిని, అధికారులు సతీష్, ఉప్పల్ తహసిల్దార్ వాణి, సర్వేయర్ వెంకటేష్ నేతృత్వంలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. 3.12 ఎకరాల ప్రభుత్వ స్థలానికిగాను ప్రస్తుతం కేవలం 19గుంటలు మాత్రమే వున్నదని రెవెన్యూ అధికారులకు కార్పొరేటర్, కాలనీవాసులు వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పవన్‌కుమార్, కాలనీ వాసులు ప్రభుత్వ స్థలం యొక్క వివరాలను హైడ్రా బృందానికి వివరించారు. గత అధికారుల తప్పుడు నిర్ణయాల వల్ల 3.12 ఎకరాల ప్రభుత్వ స్థలానికి గాను కేవలం 9 గంటలు మాత్రమే ఉందని పూర్తి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి కాలనీ అవసరాలకు కేటాయించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ భవన నిర్మాణాలు వెలిశాయని వాటిపై కూడా దృష్టి సారించి చర్యలు చేపట్టాలని వారు అధికారులను కోరారు. ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి వెంటనే కమిషనర్ స్థాయిలో మరోసారి సర్వే నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి, టిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎలిమినేటి జంగారెడ్డి, మంచి రాజేష్, మహేష్, లింగాల రాహుల్‌గౌడ్, రామ్‌నాథ్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భూమయ్య రచనలు సాహిత్యరంగంలో విశిష్టశిల్పం కలిగినవి : ఆచార్య కిషన్‌రావు



సీతాన్వేషణము గ్రంథాన్ని వేముల శ్రీనివాస్ దంపతులకు అంకితమిస్తున్న కిషన్‌రావు, నిత్యానందరావు, రఘురామ్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, సెప్టెంబరు 5 ప్రభాతవార్త :**
ఆచార్య అనుమాండ్ల భూమయ్య రచనలు సాహిత్య రంగంలో ప్రత్యేకశైలి, విశిష్ట శిల్పం కలిగి పాఠకులకు ఎప్పుడెప్పుడు చదువుదామా అనే ఎదురుచూపు, ఆసక్తిని రేకిస్తాయని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, పాల్కురికి పీఠం సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఆచార్య అనుమాండ్ల భూమయ్య అమృతోత్సవాన్ని పురస్కరించుకొని విహారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తంగెడ కిషన్‌రావు విశిష్ట అతిథులు డా. ఏల్చూరి మురళీధరరావు, ఆచార్య వెల్దండ నిత్యానందరావు, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో కలిసి ఆచార్య అనుమాండ్ల భూమయ్య రచించిన సీతాన్వేషణము గ్రంథాన్ని ఆవిష్కరించి, డా. వేముల శ్రీనివాస్ దంపతులను ఘనంగా సత్కరించి తొలికృతిని అందించి అంకితోత్సవం కావించారు. సభకు కిన్నెర రఘురామ్ స్వాగతం పలికారు. ఆచార్య అనుమాండ్ల భూమయ్య అమృతోత్సవాన్ని పంచుకున్నారు.

## బైకు దొంగల ముఠా అరెస్ట్

**ముషీరాబాద్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** పార్కు చేసి ఉన్న బైకులను దొంగిలించి, వాటిని స్క్రాప్ కు అమ్ముతున్న ముఠాను ముషీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో చిక్కడపల్లి ఏసీపీ ఎల్ రమేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. గత నెల 26వ తేదీ భోలక్‌పూర్‌కు చెందిన అబ్దుల్ ముజీబ్ అనే వ్యక్తి స్నేహితునితో కలసి పార్శిగుట్టలోని ఎంఆర్ఎన్ బార్‌కు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. బార్ వద్ద వాహనాన్ని పార్క్‌చేసి లోపలకు వెళ్లి, కొద్ది సేపటికి బయటకు వచ్చేసరికి బండి లేకపోవటంతో ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా ఇద్దరు వ్యక్తులు బండిని తీసుకుపోవటం గుర్తించారు. దర్యాప్తును వేగవంతం చేసిన ముషీరాబాద్ పోలీస్ టీం గురువారం చాకచక్యంగా బైకును దొంగిలించిన వారిని పట్టుకుని విచారించగా. భోలక్‌పూర్‌లో నివసించే ఎండి ఖాజా హుస్సేన్ (31), యూసఫ్ పాషా (42)లు ద్విచక్ర వాహనాలను దొంగిలించి, వాటిని స్క్రాప్‌గా మార్చి వాటిని అదే ప్రాంతానికి చెందిన స్క్రాప్ వ్యాపారులు మహ్మద్ సద్దాం హుస్సేన్ (31) , రెహమత్‌హుస్సేన్ (39), మహ్మద్ గుల్లాం దస్తగిరి(30)లకు విక్రయించేవారని గుర్తించారు. బైకులను దొంగిలిస్తున్న ఖాజా హుస్సేన్‌ను, వాటిని స్క్రాప్‌గా మారుస్తున్న యూసఫ్ పాషాను, స్క్రాప్ గా కొనుగోలు చేస్తున్న మహ్మద్ సద్దాం హుస్సేన్‌ను, రెహమత్ హుస్సేన్, మహ్మద్ గుల్లాం దస్తగిరిలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రెండు ద్విచక్ర వాహనాలు, 85 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఎంతో చాకచక్యంగా నిందితులను పట్టుకున్న ముషీరాబాద్ సీఐ జి.రాంబాబు, డీఐ నదీమ్ హుస్సేన్, ఎస్ఐ చలపతిరెడ్డి, క్రైం సిబ్బంది కే.కిషోర్, ఎం.ప్రకాష్, సాయికుమార్, సి.దిలీప్ కుమార్ లను సెంట్రల్‌జోన్ డీసీపీ అక్షన్ష్ యాదవ్, అడిషనల్ డిసీపీ బి.ఆనంద్‌కుమార్, చిక్కడపల్లి ఏసీపీ ఎల్ రమేష్ కుమార్‌లు అభినందించారు.

# లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలి

**ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

**ఎల్బీనగర్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త) :**

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లక్ష రూపాయల చెక్‌తో పాటు తులం బంగారం కూడా ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని విద్యా శాఖ మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సరూర్ నగర్ తహసిల్దార్ కార్యాలయంలో ఆర్కేపురం, సరూర్ నగర్ డివిజన్ ల లబ్ధిదారులకు చెక్ ల పంపిణీ కార్యక్రమానికి ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సబిత లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఆడబిడ్డకు ఆసరాగా ఉంటదనే ఉద్యేషంతోనే కేసీఆర్ కల్యాణ లక్ష్మి, షాదిముభారక్ పథకాలు తీసుక రావడం జరిగిందని తెలిపారు. విద్యార్థినిల కోసమే దాదాపు 600 గురుకులాలు ఏర్పాటు చేసి ఉన్నత విద్య చదివేందుకు కృషి చేశారన్నారు. గురుకులాలను ప్రభుత్వము నిర్లక్ష్యం చేస్తుందని, గురుకులాల్లో విద్యార్థుల బాధలు వర్ణనాతీతమన్నారు. గురుకులాల్లో సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్స్ విద్యుత్ కోసం దరఖాస్తు చేసినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కృష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్య, మహేశ్వరం నియోజకవర్గము బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, ఆకుల అరవింద్ కుమార్, లోకసాని కొండల్ రెడ్డి, కొంద్ర శ్రీనివాస్, సాజిద్, శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, స్వప్న, సుశీలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది : ఎండీ శ్రీనివాస్

**మలక్‌పేట, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త) :**

విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఎండి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రియాంక సింగ్ లు పేర్కొన్నారు. శాలివాహన నగర్ లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠ్యాంశాలను బోధించారు. ఈ సందర్భంగా ఎండి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రియాంక సింగ్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది అని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

**కార్పొరేటర్ కొత్త కాపు అరుణ**



**సైదాబాద్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త) :**

సైదాబాద్ డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. ఎల్.సి.హెచ్ చిన్న కాలనీలో నూతన బంచ్ కేబుల్ ఏర్పాటు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. అనంతరం వెంకటాద్రి నగర్‌లో పర్యటించి రోడ్లపై వాటర్ లీకేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వాటర్ లీకేజీ వల్ల భక్తులకు ఇబ్బంది వెలుగుతుందని, వినాయక చవితి పండుగను దృష్టిలో పెట్టుకొని వెంటనే సమస్యను పరిష్కరించాలని వాటర్ వర్క్ అధికారులకు సూచించారు. ఎస్.బి.హెచ్-ఏ కాలనీ, జిఎ-2 కాలనీలలో రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమాలలో మని, అనిల్, జహంగీర్, వాటర్ వర్క్ మేనేజర్ శ్రవణ్, వర్క్ ఇన్ స్పెక్టర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల పరిశీలన

**హయత్ నగర్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త) :**

నార్ముల్ మదర్ డైరీలో ఈనెల 13న జరుగనున్న ఆరు పాలకవర్గ స్థానాల ఎన్నికలకు సంబంధించి బుధవారం మొత్తం 21 నామినేషన్ దాఖలయిన విషయం తెలిసిందే. అందులో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించి 15, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించి 6 నామినేషన్లు దాఖాలు కాగా.. గురువారం వాటి పరిశీలన జరిగింది. అన్ని నామినేషన్లు సవ్యంగానే ఉన్నట్లు ఎన్నికల అధికారి వెంకట్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుండి 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## లయోల మాంటిస్సోరి స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం



**వనస్థలిపురం, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త) :**

వనస్థలిపురంలోని లయోల మాంటిస్సోరి స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా లయోలా విద్యాసంస్థల చైర్మన్ రంగినేని వెంకట్‌రావు ఉపాధ్యాయ పితామహుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదితే అనుకున్నది సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## తుర్కయంజాల్ అభివృద్ధిలో ముందడుగు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**తుర్కయంజాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

**తుర్కయంజాల్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త) :**



కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండలంలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్,కమ్మగూడ, ఇంజాపూర్, రాగన్న గూడా, మునుగనూర్, కోహెడ ప్రాంతాల్లోని పలు కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపనలు, కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవాలు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పలు ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోట్లాది రూపాయలతో నేడు తుర్కాయంజాల్ మున్సిపాలిటీలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశామన్నారు. గత ప్రభుత్వ పాలకులు తుర్కయంజాల్‌ను అధోగతి పలు చేసి అభివృద్ధికి ఆమడ దూరంలోకి నెట్టారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్దపీట వేసిందని, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కోట్లాది నిధులతో మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తారన్నారు. అనుకున్నట్లే ఆరు గ్యారంటీలను ఒక్కొకటిగా ప్రారంభించిందని పేదలకు మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామ్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, డీసీసీబీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్త కురుమ సత్తయ్య, టీపీసీసీ కార్యదర్శి కొత్త కుర్మా శివకుమార్, మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షులు కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్, టీపీసీసీ సభ్యులు కౌన్సిలర్ కాకుమాను సునీల్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య కౌన్సిలర్లు కుంట ఉదయశ్రీ గోపాల్‌రెడ్డి, కంబాలపల్లి ధనరాజ్‌గౌడ్, నక్క శివలింగంగౌడ్, వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి, మేతరి అనురాధ దర్శన్, భాగ్యమ్మ ధనరాజ్, రేవెల్ల హరిత యాదగిరి, మర్రి మాధవి మహేందర్‌రెడ్డి, బొక్క రవీందర్‌రెడ్డి, నరాని కవిత శేఖర్ గౌడ్, పుల్లగూరం కీర్తన విజయనంద్ రెడ్డి, నాయకులు మాజీ ఎంపీటీసీ ఎం. మోహన్ నాయక్, డాక్టర్ రగ్య నాయక్, బాయ్ ముత్క శ్రీనివాస్, హనుమంతు గౌడు, వేముల శంకర్, రాజు నాయక్, హనుమ నాయక్, వెంకట్రావు, ప్రజాప్రతినిధులు అధికారులు అధికారులు పాల్గొన్నారు.

## తమ ప్లాట్లను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**హయత్‌నగర్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త) :**

తాము కొనుగోలు చేసిన ప్లాట్లను ఆక్రమించి ప్రహరీ నిర్మించే వారిపై చర్యలు తీసుకోవాలని కంట్లూరు గ్రామానికి చెందిన బద్దం భూపాల్‌రెడ్డి, గ్యారాల హరిబాబు పోలీసు, మున్సిపల్ అధికారులకు విన్నవించారు. గ్రామంలోని సర్వే నెంబర్ 201లో తాము 600 గజాల స్థలాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు సరైన అనుమతులు లేకుండానే రోడ్లను కబ్జా చేస్తూ, తమ ప్లాట్లకు అడ్డుగా ప్రహరీ నిర్మిస్తున్నారని తెలిపారు. దీనికి తోడు తమ ప్లాట్లను సైతం వారికే విక్రయించాలని తమపై ఒత్తిడి తెస్తున్నారని వివరించారు. ఈ విషయంపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు మున్సిపల్, పోలీసు అధికారులను కోరారు.

## జలమండలి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలి : పొల్కమ్ శ్రీనివాస్



**మలక్‌పేట, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త) :**

జలమండలి కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు చెల్లించాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. జలమండలి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని కోరుతూ జలమండలి ఈడి మిట్టలను ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులు చెల్లించాలని జలమండలి కార్యాలయం చుట్టూ పలువురు కాంట్రాక్టర్లు తిరుగుతున్నారని పేర్కొన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ విషయంపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. బిల్లులు చెల్లించకపోవడంతో పలువురు కాంట్రాక్టర్లు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం గురించి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వెంటనే ఆయన స్పందించి పాత బిల్లు లను విడుదల చేయాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డిని ఆదేశించడం జరిగిందని పేర్కొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమాన్ని కృషి : ఎమ్మెల్యే బాలల



**మలక్‌పేట, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త) :**

దివ్యాంగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. దివ్యాంగుల జాతీయ సెన్సార్ పార్క్‌పై జోనల్ కమిషనర్, వివిధ శాఖ అధికారులతో ఎమ్మెల్యే బలాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ దివ్యాంగుల కోసం పార్కులో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సౌత్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న, పలువురు అధికారులు, ఎంఐఎం నాయకులు సైపుద్దీన్ షఫీ, ఫెడ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భావి పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**కరస్పాండెంట్ రాజేష్**



**కుషాయిగూడ, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త) :**

భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని విజయ హైస్కూల్ కరస్పాండెంట్ రాజేష్ కాప్రా సర్కిల్ పరిధిలోని విజయ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఒక చిరస్మరణీయ సందర్భం, విద్యార్థులు తమ ఉపాధ్యాయులను సాంప్రదాయ గురు వందనలి కార్యక్రమం ద్వారా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కె. రాజేశ్వర్ మరియు డైరెక్టర్ కె.వీణ, ప్రిన్సిపాల్ డి. వెంగబాబు హాజరై వేడుకల నిర్వహణలో మరియు పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పట్ల గౌరవం మరియు అభిమానానికి ప్రతీకగా ప్రార్థనలు చేసి, గురు వందనం చేస్తూ తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు అంకితం చేసిన నృత్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమంతో కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి గర్వం మరియు కృతజ్ఞతా భావాన్ని మిగిల్చింది, ఇది విద్యార్థులకు మరియు ఉపాధ్యాయులకు ఒక ప్రతిష్ఠాత్మకమైన రోజుగా మారింది.

## రామ మందిర నిర్మాణానికి వీహెచ్‌పి అలుపెరగని పోరాటం

**- సునీత రామ్మోహన్ రెడ్డి**

**మల్కాజ్‌గిరి, సెప్టెంబర్, (ప్రభాతవార్త) :**

హిందూ సమాజ నిర్మాణానికి భారతీయ సంస్కృతి సాంప్రదాయం కాపాడడానికి విశ్వహిందూ పరిషత్ నిరంతరం పాటుపడుతుందని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బేరి సునీత రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మల్కాజిగిరిలో మిర్జాలగూడలో విశ్వహిందూ పరిషత్ 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మహోత్సవాలను నిర్వహించారు మిర్యాలగూడలో విహెచ్ పి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విహెచ్పి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బిరి సునీత రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ ప్రారంభమై 60 సంవత్సరాల్లో సాధించిన విజయాలను వివరించారు హిందువుల చిరకాల స్వప్నం అయోధ్యలో రామాలయ నిర్మాణం గురించి అలుపెరుగని పోరాటంలో యావత్ హిందూ సమాజాన్ని ఒకటి చేయడంలో విహెచ్పి నిత్యం హిందూ సమాజ నిర్మాణానికి కృషి చేస్తుందని అన్నారు ప్రతి ఒక్కరు పరిషత్ ఆధ్వర్యం లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని సమ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. నేటి యువత మన సంస్కృతి సంప్రదాయాలను మర్చిపోతున్నారన్నారు విదేశీ సంస్కృతిని అలవాటు పడుతూ మన సంస్కృతిని మర్చిపోతున్నారన్నారు. నేటి యువత తప్పుడు మార్గంలో పయనించకుండా మన సంస్కృతి సాంప్రదాయం గౌరవించాలన్నారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ప్రపంచంలోనే ఎంతో గొప్పదైన సంస్కృతి మన భారతదేశంలోనే ఉన్నదన్నారు. కార్యక్రమంలో విహెచ్పి భాగ్యనగర్ క్షేత్ర అధికారి శివప్రసాద్, శివానంద్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు రామ నర్సింహులు జిల్లా కోశాధికారి రామ్మోహన్ రెడ్డి, కార్యదర్శి రజనీకాంత్ దుర్గాప్రసాద్ రాజిరెడ్డి బజరంగ్దళ్ కన్వీనర్ నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ బిజెపి సీనియర్ నాయకులు రాంబాబు బాలచందర్ గౌడ్ స్థానిక హిందూ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిల్కానగర్ డివిజన్ సమస్యలపై మేయర్ విజయలక్ష్మి వినతి



**ఉప్పల్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త) :**

చిల్కానగర్ డివిజన్ సమస్యలపై కార్పోరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ గురువారం నగర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరియు డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి తో కలిసి చిల్కానగర్ ప్రధాన రహదారిలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కు పలు సమస్యలు విన్నవించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిల్కానగర్ చౌరస్తా నుండి కావేరి నగర్ కల్వర్టు వరకు సీవరేజ్ పైప్ లైన్ బాగా పాడైపోయిందని తరచూ సీవరేజ్ ఓవర్ ఫ్లో అవుతుందని, పాత చెరువులకు, మరియు ఆదివారం కూరగాయల మార్కెట్ సమయాల్లో కూడా సీబరేజ్ వల్ల చాలా ఇబ్బంది జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా సిసి రోడ్డు కూడా బాగా పాడైపోయిందని సిఆర్ఎంపీలో ఎన్నోసార్లు దరఖాస్తు పెట్టుకున్న రోడ్డు శాంక్షన్ అవ్వలేదని, వెంటనే ఎస్ఎన్‌డి పి పథకం కింద చిల్కానగర్ చౌరస్తా నుండి కావేరి నగర్ కల్వర్టు వరకు ట్రంక్ లైన్ ఏర్పాటు చేయాలని, అదేవిధంగా దానిపైన సిసి రోడ్ కు కూడా నిధులు కేటాయించాల్సిందిగా అభ్యర్థన చేస్తూ వారికి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వెంటనే జోనల్ కమిషనర్ కు ప్రతిపాదనలు తయారు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎదుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ముద్దం శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, పిట్టల నరేష్, చేర్యాల శ్రీనివాస్ ,మాస శేఖర్, బాణాల నారాయణరెడ్డి, రామాంజనేయులు,రవీందర్ గౌడ్,ఎండి షఫీ, ఎండి గౌస్, ఎండి హనీఫ్ , బాలకృష్ణ, మహమూద్, సుందర్, యాదగిరి, పోచయ్య, శ్యామ్, మొదలగు వారు పాల్గొన్నారు.



**గురువారం టీచర్ డే సందర్భంగా దిల్ సుఖ్ నగర్ డిపో టి. సమతా, అసిస్టెంట్ మేనేజర్ వెంకన్న, ఎల్‌బీ నగర్ పాయింట్ లో బస్ లలో ప్రతీ రోజు ప్రయాణిస్తున్న టీచర్ ప్రయాణికులకు గులాబీ పుష్పం ఇవ్వడం జరిగినది. ఉపాధ్యాయుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.**
**టీచర్లు మేనేజర్‌కు అభినందనలు తెలిపారు. తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.**
**- ప్రభాతవార్త, దిల్ సుఖ్ నగర్**

## సుభాష్ చందర్జీ ఇంటికి గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 5 (ప్రభాత వార్త) :**



త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి బుధవారం సాయంత్రం నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ ఇంటికి వచ్చారు. సైదాబాద్ లోని సుభాష్ చందర్జీ ఇంటికి వచ్చిన గవర్నర్ ఇంద్ర సేనా రెడ్డి ఆయనతో వివిధ అంశాల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి & షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**నాచారం, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త) :**

నాచారం డివిజన్‌కు చెందిన 50 మంది లబ్ధిదారులకు గురువారం మల్లాపూర్‌లోని విఎన్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు గత ప్రభుత్వం ఇచ్చిన ఒక లక్ష 116 రూపాయలతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం లబ్ధిదారులకు తులం బంగారం కూడా ఇస్తే పేదింటి ఆడపిల్లలకు ఎంతో లాభం చేసినట్లు ఉంటుందని ఇకనైనా రాబోయే లబ్ధిదారులకు తులం బంగారం కూడా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మండల తహసీల్దార్ వాణిరెడ్డి, గ్రేటర్ భారాస నాయకులు సాయి జన్ శేకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**హయత్ నగర్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త) :**

పెద్దఅంబర్ పేట మున్సిపాలిటీ పరిధి పసుమాముల రోడ్డులోని స్మశాన వాటిక వద్ద 11కేవీ లైన్ మరియు ఎల్‌టీ లైన్ మార్చడం కోసం ఈనెల 6న ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెండు గంటల పాటు 11కేవీ కోహెడ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు పెద్దఅంబర్ పేట విద్యుత్ శాఖ ఏఈ చంద్రమౌళి తెలిపారు. ఫీడర్ పరిధిలోని సాయి కాలనీ, రాఘ వేంద్ర కాలనీ, శిల్పి కాలనీ, రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిసర ప్రాంతాలు, కోహెడ రోడ్డు పరిసర ప్రాంతాలు, సదాశివ కాలనీ, శాంతి నగర్, బలిజగూడ రోడ్డు పరిసర ప్రాంతాలు, తారా హోమ్ ప్రాంతంలో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## సమస్య పరిష్కారానికి తన వంతు కృషి

**హస్తినాపురం కార్పొరేటర్ భానోత్ సుజాత నాయక్**



**వనస్థలిపురం, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త) :**

హస్తినాపురం డివిజన్‌లో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకు వస్తే సమస్య పరిస్కారానికి తన వంతు కృషి చేస్తానని హస్తినాపురం కార్పొరేటర్ భానోత్ సుజాత నాయక్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని కాలనీ వాసుల ద్వారా సమాచారం అందుకున్న కార్పొరేటర్ వెంటనే కాలనీకి సమస్యను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించి కాలనివాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి.సంఘం నాయకుడు దుర్గయ్య గౌడ్,గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,మమత మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట వాస్తవ చరిత్రపై ప్రచారం



**హయత్ నగర్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త) :**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వాస్తవ చరిత్రను ప్రచారం చేస్తూ ఈ నెల సెప్టెంబర్ 7 నుండి 17 వరకు తెలంగాణ వీరయోధుల స్మరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రా చారి తెలిపారు. ఈ మేరకు గురువారం పెద్దఅంబర్ పేట మున్సిపాలిటీ పరిధి %ఎబత్‌శ్రీశీతీ% గ్రామం రావి నారాయణరెడ్డి కాలనీ పేస్ -3 (భూ పోరాట కేంద్రం)లో తెలంగాణ ప్రజా పోరాట చరిత్ర బుక్ లెట్ ను నాయకులు ఆవిష్కరించారు, ఈ సందర్భంగా ఆందోజు రవీంద్ర చారీ మాట్లాడుతూ... వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని కొన్ని రాజకీయ మత తత్వ పార్టీలు హిందూ ముస్లిం పోరాటంగా చరిత్రగా వక్రీకరిస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ సాయుధ పోరాటం ప్రజా పోరాటం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, భూమికోసం భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోస%శీ% అన్ని వర్గాల ప్రజలు నడిపిన ఉద్యమమన్నారు. ఎందరో తమ మాన, ప్రాణాలను పణంగా పెట్టిన ఉద్యమాన్ని వక్రీకరిస్తే ఊరుకునేది లేదన్నారు. వీర తెలంగాణ యోధుల చరిత్రను త్యాగాలను స్మరించుకుంటూ పార్టీ శ్రేణులు భూ పోరాటాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, నాయకులు అజ్మీర్ హరిసింగ్ నాయక్, కేతరాజు నర్సింహా, వంశీ వర్ధన్, మధు, యాదగిరి, దాసరి ప్రసాద్ పాల్గొన్నారు.